క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.2.76 లక్షల విరాళం



దాత బ్రహ్మం, తులసిశ్రీలకు విరాళం రసీదును అందజేస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు ఆదివారం రూ. 2,76,383 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ఏలూరుకు చెందిన జీఎస్ఎస్ బ్రహ్మం రూ.1,01,116, గారపాటి తులసిశ్రీ రూ. 50,116, అలాగే తిరువూరుకు చెందిన ఎన్‌కే సంతోష్ రూ.1,00,151, ఎస్ఎస్ సంతోషిణి రూ. 25,000 వెరసి రూ. 2,76,383 లను ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి విరాళం బాండ్ పత్రాలు, రసీదులు, శ్రీవారి ప్రసాదాలను అందించారు. అనంతరం వారికి స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని కల్పించారు.

ఏఎంసీ వైస్ చైర్మన్ రామకృష్ణకు సన్మానం



రామకృష్ణను సత్కరిస్తున్న క్రైస్తవ విశ్వాసులు

కొయ్యలగూడెం : పోలవరం ఏఎంసీ వైస్ చైర్మన్‌గా నియమితులైన తాడిగడప రామకృష్ణను ఆదివారం అంకాలగూడెం సెయింట్ ఇమ్మానియేలు చర్చిలో సన్మానించారు. పాస్టర్ రాజేష్ బాబు ఆధ్వర్యంలో విశ్వాసుల సమక్షంలో రామకృష్ణను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. దళితులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు, ప్రాముఖ్యత గతంలో ఏ పార్టీలు అమలు చేయలేదని పాస్టర్ల సంఘం నాయకులు పేర్కొన్నారు. ముందుగా మణిపూర్ అల్లర్లలో అశువులు బాసిన వారి ఆత్మ శాంతికై శ్రద్ధాంజలి ఘటించి గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టపు కుమారి, కలపాల జ్యోతి, అద్దంకి రేఖశ్రీ, పట్టపు రాణి పాల్గొన్నారు.

వలంటీర్ పద్మ మృతి



కొయ్యలగూడెం : వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న కొయ్యలగూడెం గ్రామానికి చెందిన పాదపాక పద్మ(35) ఆదివారం మృతి చెందింది. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. సత్యసాయి నగర్‌లో నివాసం ఉంటున్న పద్మ దివ్యాంగులు అయినప్పటికీ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిందని స్థానికులు పేర్కొన్నారు. నిత్యం లబ్ధిదారులతో మమేకమై వారి సాధక బాధలు తెలుసుకుంటూ అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఎంతో సహకరించేదని వార్డు సభ్యులు రాచూరి మధన్ తెలిపారు. పద్మ భౌతిక కాయాన్ని వలంటీర్ల బృందం సందర్శించి నివాళులర్పించారు. సచివాలయాల కోఆర్డినేటర్ నూకల రాము, భారతి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసపురం సర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం సర్పంచ్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 13న పరిశీలన, 14న తుది జాబితా ఎంపిక, 19న శ్రీనివాసపురంలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. శ్రీనివాసపురం సర్పంచ్ యడ్లపల్లి దుర్గారావు మృతి చెందడంతో గత 8 నెలలుగా ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఇద్దరు లారీ డ్రైవర్ల మధ్య ఘర్షణ

ఏలూరు టౌన్: మద్యం మత్తులో ఇద్దరు లారీ డ్రైవర్లు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఏలూరు తూర్పువీధికి చెందిన వీర్ల కృష్ణ (42)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతని స్నేహితుడైన చాటపర్రుకు చెందిన లారీడ్రైవర్ అన్నవరంతో కలిసి ఏలూరు తంగెళ్ళమూడిలోని ఒక బార్ వద్ద మద్యం తాగారు. ఇద్దరి మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారితీసింది. అన్నవరం చేతితో గట్టిగా కృష్ణను చెవిపై కొట్టడంతో కిందపడిపోయాడు. చెవి నుంచి విపరీతమైన రక్తస్రావం కావడంతో అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. మెడికో లీగల్ కేసుగా నమోదు చేశారు. ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై వీ.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు భరించలేక..

ఏలూరు టౌన్: దెందులూరు మండలం కొమరేపల్లికి చెందిన కొరపాటి నాగయ్య (35)కు భార్య ఝాన్సీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగయ్య వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన కాలే శ్రీను, అతని భార్య ఎస్తేరు రాణి వేధించడంతో నాగయ్య, ఝాన్సీ ఇంటివద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. వీరు తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో బంధువులు ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించారు. వైద్యులు హాస్పిటల్ అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

రూ.1.72 కోట్లతో బీటీజీ రోడ్డు నిర్మాణం

రోడ్డు నిర్మాణానికి కౌన్సిల్ తీర్మానం



జంగారెడ్డిగూడెం పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్

జంగారెడ్డిగూడెం : పట్టణంలో బుట్టాయగూడెం రోడ్డు నిర్మాణానికి మోక్షం కలిగింది. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ. 1.72 కోట్లతో ఈ రోడ్డును నిర్మించేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. పట్టణంలో ప్రధాన రోడ్డు మార్గాల్లో బుట్టాయగూడెం రోడ్డు ఒకటి. స్థానిక గంగానమ్మ గుడి సెంటర్ నుంచి బైపాస్ రోడ్డుకు చేరుకుని అక్కడ నుంచి ఏజెన్సీలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. దీంతో ఈ రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. 2018 ఆగస్టులో వచ్చిన వరదల కారణంగా కొవ్వూరు రోడ్డులో గల బైనేరు బ్రిడ్జి కూలిపోయింది. కొవ్వూరు రోడ్డులో రాకపోకలు స్తంభించాయి. దీంతో కొవ్వూరు వైపు వాహనాలు వెళ్లేందుకు బుట్టాయగూడెం రోడ్‌లోని బైపాస్ మీదుగా అనుమతించడంతో ఈ రోడ్డుకు మరింత రద్దీ పెరిగింది. అప్పటి నుంచి వాహనాల రద్దీ పెరిగి ఈ రోడ్డు ధ్వంసమైంది. దీని నిర్వహణ మున్సిపాలిటీకి భారం అయ్యింది. దీంతో ఈ ఏడాది జూన్‌లో ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీ శాఖకు బదిలీ చేస్తూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్‌అండ్‌బీ శాఖాధికారులతో సంప్రదింపులు జరిపారు. అయితే ఈ ప్రక్రియ పూర్తి కావడానికి చాలా కాలం పడుతుందని అధికారులు వెల్లడించారు. దీంతో మున్సిపల్ సాధారణ నిధులు వెచ్చించి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించింది. జూలై 26వ తేదీన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఈరోడ్డు నిర్మాణానికి రూ.1.72 కోట్లు వెచ్చించేందుకు తీర్మానించింది. మొత్తం రోడ్డు పొడవు పొట్టిశ్రీరాముల విగ్రహం నుంచి బుట్టాయగూడెం రోడ్ బైపాస్ జంక్షన్ వరకు 1.1 కిలోమీటర్లు ఉంది. అయితే ఈ రోడ్డులో కొంత భాగం చవుడు నేల కావడంతో ఎన్నిసార్లు రోడ్డు వేసినా ధ్వంసం అవుతుంది. దీంతో ఈ ప్రాంతంలో గాంధీ విగ్రహం నుంచి 1వ సచివాలయం రోడ్డు వరకు అంటే సుమారు 360 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఈ రోడ్డు వెడల్పు 7.5 మీ నిర్మిస్తారు. ఇందుకోసం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 62,31,509 వెచ్చించనున్నారు. మిగిలిన రోడ్డు సుమారు 700 మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించనున్నారు. దీనికి మున్సిపల్ సాధారణ నిధుల నంచి రూ. 1.10 కోట్లు వెచ్చించనున్నారు. దీంతో ఈ రోడ్డుకు మోక్షం కలగనుంది. ఇదిలా ఉంటే రోడ్డు నిర్మించేందుకు గత నెల 26న మున్సిపల్ సమావేశం తీర్మానించగా, 27వ తేదీన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వర్షాలు నేపథ్యంలో ఈ రోడ్లో నాట్లు వేయడం, చేపలు పట్టడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శించారు. రోడ్డు నిర్మాణానికి తీర్మానం చేసిన తరువాత ఇటువంటి చర్యల పట్ల ప్రజలు నవ్వుకుంటున్నారు.

రహదారి పనులు ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి రహదారి పనులు ప్రారంభించిన సర్పంచ్ నాగేంద్రబాబు

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం నుంచి అక్కంపేట మీదుగా తోటపల్లి క్రాస్ రోడ్డు వరకు రహదారి పనులను ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ పారేపల్లి నాగేంద్రబాబు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.79.50 లక్షల పంచాయతీ రాజ్ నిధులతో 2.3 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ రహదారి గోతులమయంగా మారి ప్రజల ఇబ్బందులు పడటంతో సమస్యను జిల్లా పర్యటనకు విచ్చేసిన సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. నిధులు మంజూరు కావడంతో రహదారి పనులు ప్రారంభించమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వింజమూరి కిరణ్ కిషోర్, శ్రీనివాసపురం సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, అక్కంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు పారేపల్లి గంగారావు, బాలం బుజ్జి, పోల్నాటి నాని, పోల్నాటి రాజా, నులకాని సూరిబాబు, సూర్య భాస్కరరావు, అక్కంపేట మాజీ ఉపసర్పంచ్ గొల్లమందల శ్రీనివాసరావు, బల్లే విజయ్, తడికమళ్ళ జయరాజు, కేశవరావు, ములకల సూరిబాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



పొంగుటూరులో డ్రెయినేజీ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ పసుపులేటి రాంబాబు ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డ్రెయినేజీ నిర్మాణంపై ప్రజల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన వినతుల మేరకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు స్పందించి సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల నిధులను డ్రెయినేజీ నిర్మాణానికి వినియోగిస్తామని హామీ ఇచ్చారు. దాదాపు 600 మీటర్ల మేర నిర్మించబోయే పక్కా డ్రెయినేజీ నిర్మాణం వల్ల ఎస్సీ, బీసీ, ఓసీ ఏరియాలోని ప్రజలకు ప్రధాన డ్రెయినేజీ రూపదాల్చనుంది. కార్యక్రమంలో గేలం శ్రీను, గేలం వెంకటేశ్వరరావు, కైకవరపు గోపి, తానేటి రాజు, పసుపులేటి రవీంద్ర, దిర్సిపాము మధు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : మంగపతిదేవి పేట గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఐసీడీఎస్ కార్యకర్తలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీటీసీ తేలే శ్రీనివాస్, సర్పంచ్ అబ్బు సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆవశ్యకత గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. 3 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ముందుగా గ్రామంలో సంపూర్ణ పోషణ, తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ కార్యక్రమాలు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సెంటర్ 148, 13, 14 కేంద్రాల కార్యకర్తలు కె.షాలిని, కె.ధనలక్ష్మి, కె. భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుంకు పండుగ




మెరకగూడెంలో సుంకు పండుగ పూజలు చేస్తున్న దృశ్యం



వనదేవతకు పూజలు చేస్తున్న చిన్నారులు

బుట్టాయగూడెం : మండలంలోని మెరకగూడెంలో ఆదివారం సుంకు పండుగను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వన దేవతకు దూప, దీప నైవేద్యాలతో పూజలు చేశారు. ఆదివాసీ గిరిజనుల ఇంటి పేర్లల్లో సోదెం వారి ఇలవేల్పులు ఆడమ రాజు తండ్రి పేరుతో ఈ సుంకు పండగను నిర్వహించినట్లు ఇలవేల్పుల కరకర వడ్డి పూజారి సోదెం సుధాకర్ తెలిపారు. తమ ఇంటి పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల పరిధిలో తమ ఇలవేల్పుల గద్దెలు 24 ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థిస్తూ వ్యవసాయ పనులు జరిగే సమయంలో ఈ సుంకు పండుగ చేస్తామని సుధాకర్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సుంకు పండుగలో వనదేవతకు మొక్కులు చెల్లించి అనంతరం సహపంక్తి భోజనం చేయడం జరుగుతుందని చెప్పారు.

బ్రాహ్మణులకు అండగా సంక్షేమ పథకాలు



బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సాయి సురేష్‌ను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో పేద బ్రాహ్మణులకు అండగా బ్రాహ్మణ కార్పొరేషన్ పని చేస్తోందని కార్పొరేషన్ డైరెక్టర్ యనమండ్ర సాయి సురేష్ తెలిపారు. ఆదివారం నగరానికి చెందిన రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా గతంలో అమలు చేసిన వివిధ పథకాలను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేద పాఠశాలల్లోని గురువులకు రూ. 5 వేలు, విద్యార్థులకు రూ. వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఏలూరు నగరంలో బ్రాహ్మణ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ళ నాని స్థలం కేటాయించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర రాజధానిలో బ్రాహ్మణ భవన్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సత్యవాడ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బ్రాహ్మణులపై ప్రత్యేక అభిమానంతో సీఎం జగన్ ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ డైరెక్టర్ సురేష్‌ను బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు టీఆర్ శర్మ, ఉపాధ్యక్షుడు మద్దాలి భాస్కర్, ఐకాస సత్రంపాడు అధ్యక్షుడు గోపరాజు వెంకట్రామయ్య, హేలాపురి ఆర్ష సేవా సమితి అధ్యక్షుడు వీవీఎస్ సుబ్రహ్మణ్యేశ్వర రావు పాల్గొన్నారు.

వరద బాధితులకు నష్టపరిహారం సొమ్ము పంపిణీ



వరద బాధితులకు నష్టపరిహారం సొమ్మును అందిస్తున్న ఎంపీపీ శాంతి

బుట్టాయగూడెం : వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉండి అన్ని రకాల సేవలు అందించడం జరిగిందని ఎంపీపీ కారం శాంతి అన్నారు. బుట్టాయగూడెం మండలం ముప్పినవారిగూడెం సమీపంలోని పునరావాస గ్రామమైన చిగురుమామిడికి తరలివచ్చిన వరద బాధితులకు ఆదివారం ప్రభుత్వం అందించిన నష్టపరిహారం సొమ్ము రూ.2000 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ చిగురుమామిడి నిర్వాసిత గ్రామంలో సుమారు 71 కుటుంబాల వారు తరలివచ్చారని అన్నారు. వీరికి ప్రభుత్వం అందించే నష్టపరిహారం రూ.2000 పంపిణీ చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు వరద బాధితులకు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్ తెల్లం వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పనిభద్రతతో కూడిన సమగ్ర చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధర్ముల సురేష్

జంగారెడ్డిగూడెం: అసంఘటిత రంగ కార్మికులకు పని భద్రత కూడిన సమగ్ర చట్టం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్ముల సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ధర్మన్న స్మారక భవనంలో జంగారెడ్డిగూడెం డివిజన్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ ప్రథమ మహాసభ కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ధర్ముల సురేష్ మాట్లాడుతూ పని ప్రదేశాలలో ప్రమాదాలు జరిగినా, మరణించినా ప్రభుత్వం నుంచి కార్మికులకు ఎటువంటి పరిహారాలు అందడం లేదన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించేవరకు కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి మాట్లాడుతూ మోడీ అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 9న సేవ్ ఇండియా పేరిట ఐక్య కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమాలను కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎస్.రామ్మోహన్, ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ యర్రా శ్రీను, ఘంటసాల రాంబాబు, ఎం.రాము తదితరులు మాట్లాడారు.

నూతన కార్యవర్గం

జంగారెడ్డిగూడెం డివిజన్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షులుగా ఎడ్లపల్లి బుజ్జియ్య, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ముప్పిడి అబ్బులు, సహాయ కార్యదర్శిగా వాసుబోయిన శ్రీను, కోశాధికారిగా శ్యామలరావుతో 15 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. సభకు ముందు చుండూరు అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

ద్వారకాతిరుమల : మండలంలోని ఐఎస్ రాఘవాపురంలో జరిగిన ఒక దాడి ఘటనకు సంబంధించి వచ్చిన పరస్పర ఫిర్యాదులపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఐఎస్ రాఘవాపురానికి చెందిన కుర్రే వెంకటేశ్వరరావు భార్య పద్మ ఈనెల 3న తమ ఇంటి పక్కన చెత్తను తగలబెడుతోంది. ఆ సమయంలో కండెల్లి భూలక్ష్మి, భీమడోలు వెంకటేష్, కండెల్లి వెంకటేష్, కండెల్లి రాంబాబు అక్కడికొచ్చి చెత్తను తగలబెట్టడం వల్ల తమ సీతాఫలం చెట్టు కాలిపోతుందని పద్మను తిట్టారని, ఇదేంటని అడిగిన తనపై నలుగురు నిందితులు కర్రలతో దాడి చేశారని ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరిన వెంకటేశ్వరరావు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా నలుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే సరిహద్దులో తుక్కును తగలబెట్టడం వల్ల తమ సీతాఫలం చెట్టు కాలిపోయిందని, ఇదేంటని అడిగిన తనపై పద్మ తాటి కమ్మతో కొట్టిందని కండెల్లి భూలక్ష్మి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో అడ్డు వచ్చిన తన తండ్రిని పద్మ, కుర్రె వెంకటేశ్వరరావు, కుర్రె కృష్ణ కిందపడేసి కొట్టినట్టు ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కూడా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు, కార్మికులు

కామవరపుకోట : మండలంలో పేదల సాగులో ఉన్న అడవి బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కామవరపుకోటలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల పదవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, సంవత్సరానికి 200 పనిదినాలు కల్పించి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్నో ఏళ్లగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించి లక్షలాది ఎకరాల మిగులు భూములు అటవీ బంజర్లు పేదలకు సాధించడం జరిగిందని తెలిపారు. అనంతరం మండలానికి వ్యవసాయ కార్మిక సంఘం 11 మందితో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కరేటి నరసింహులు, ఉపాధ్యక్షులుగా మందపాటి ధర్మయ్య, ప్రధాన కార్యదర్శిగా గుడ్డేటి సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా సిరిసెట్టి బాల సుందరం, కోశాధికారిగా నల్లబోతుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొలిమే బాల ఏసు, నియోజకవర్గ కార్యదర్శి కంకిపాడు బుజ్జిబాబు, మండల కార్యదర్శి టీవీఎస్ రాజు, వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత నిర్ణాయక శక్తి ఆధారంగానే

జయాపజయాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వ్యక్తిగత నిర్ణాయక శక్తి ఆధారంగానే జయాపజయాలుంటాయని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి డాక్టర్ ప్రేమ్ మసంద్ తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు బ్రహ్మకుమారీస్ సంస్థ, అపుస్మా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఈ సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రేమ్‌మసంద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జన్యుపరంగా విభిన్నంగా ఉంటాడని అన్నారు. అలా ఉండటానికి గల కారణాలు తెలుసుకుని లోపాలను నివారించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. మొబైల్ ఫోన్ వాడకం వల్ల స్పాండిలైటిస్ , ఫ్రోజెన్ షోల్డర్ వంటి సమస్యలు తలెత్తుయన్నారు. వాటిని అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించేలా ప్రయత్నించాలన్నారు. మన అపేక్షలు, వాస్తవికతకు జత కుదరని కారణంగా సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సంస్థ ఏలూరు శాఖ నిర్వాహకురాలు బీకే లావణ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా కొత్త విధానాలు, విషయాలను నేర్చుకోవాలన్నారు. సమాజంలో ఉపాధ్యాయులకు అత్యున్నత గౌరవం ఉందన్నారు. ఈ సందర్భంగా బీకే సింధు ఒత్తిడిని అధిగమించడానికి తేలికపాటి వ్యాయామాలను సంగీతంతో పాటు ఉత్సాహభరితంగా చేయించారు. ఈ కార్యక్రమంలో అపుస్మా నాయకులు ఎంబీఎస్ శర్మ, కే. చంద్రశేఖర్, ఎస్ఆర్‌కేప ప్రసాద్, కే. వినోద్, కోనేరు సురేష్‌బాబు, సీఆర్ఆర్ కళాశాల ప్రిన్స్‌పాల్ కేపీ రామరాజు పాల్గొన్నారు.

జలకళలో విద్యుత్ పోల్ ఏర్పాటుకు రూ.34 వేలు



దాసరి శ్రీలక్ష్మి

కొయ్యలగూడెం : వైఎస్సార్ జలకళలో లబ్ధిదారుడైన రైతు విద్యుత్ పోల్ ఏర్పాటు చేసుకుంటే అగ్రికల్చర్ లైన్ నిమిత్తం రూ.34 వేలకు మించి కట్టాల్సిన అవసరం లేదని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం రాజవరం గ్రామంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 5వ తేదీ ఏలూరులో నిర్వహించిన జెడ్పీ సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్సీని అడిగిన ప్రశ్నకు ఆయన బదులు ఇచ్చారని అన్నారు. కొయ్యలగూడెం మండలంలో వైఎస్సార్ జలకళ లబ్ధిదారులైన రైతులనుంచి ఒక్కో స్తంభం ఏర్పాటుకు రూ.60 వేలు నుంచి రూ. 70 వేలు వరకు విద్యుత్ శాఖ అధికారులు వసూలు చేస్తున్నారని ఎస్సీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఆయన వివరణ ఇస్తూ రైతు ఒక పోల్ ఏర్పాటు చేసుకుంటే రూ. 34 వేలు చొప్పున హార్స్ పవర్‌కి రూ.200 కట్టుకోవాల్సి ఉంటుందని సమావేశంలో తెలిపారన్నారు. కొయ్యలగూడెం మండలంలో పలుచోట్ల ఇప్పటివరకు రైతులు అదనంగా చెల్లించిన అదనపు సొమ్ములపై విచారణ జరిపించాలన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జలకళ లబ్ధిదారులు నిబంధనలకు అనుగుణంగా సొమ్ము కట్టి లబ్ధి పొందాలని సూచించారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో రామయ్యకు పింఛన్ నగదును అందజేస్తున్న వలంటీర్ భాగ్యశ్రీ

జంగారెడ్డిగూడెం రూరల్ : తమ సేవలతో లబ్ధిదారుల ప్రశంసలు అందుకుంటున్నారు వలంటీర్లు. 1వ తారీఖు వచ్చిందంటే చాలు ఉదయమే పింఛన్ల పంపిణీ, అలాగే అర్హులకు సంక్షేమ పథకాలు అందించడం ఇలా అనేక కార్యక్రమాల్లో వలంటీర్లు భాగస్వాములవుతున్నారు. జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటకు చెందిన మెయ్యేటి రామయ్య పెరాలసిస్‌తో బాధపడుతూ విజయవాడలో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి పింఛన్ అందించేందుకు పేరంపేట గ్రామ వలంటీర్ భీమడోలు భాగ్యశ్రీ తన సొంత ఖర్చులతో విజయవాడ వెళ్లి రామయ్యకు పింఛన్ నగదును అందజేసి తన సేవాభావాన్ని చాటుకుంది. భాగ్యశ్రీని మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ప్రజా కళాకారుడు గద్దర్ మృతికి సంతాపం

జంగారెడ్డిగూడెం : ప్రజా కళాకారుడు గద్దర్ మృతికి ఇఫ్టూ జిల్లా కమిటీ తీవ్ర సంతాపం తెలియజేసింది. ఆదివారం జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనంలో జరిగిన ఇఫ్టూ జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కేవీ రమణ, ప్రధాన కార్యదర్శి బి వెంకటరావు మాట్లాడుతూ గాయకుడు, రచయిత గద్దర్ మృతి దేశ కళారంగానికి తీవ్ర లోటని అన్నారు. తెలుగు రాష్ట్రాలలో గద్దర్ విప్లవ ప్రయాణంలో ప్రజలను ఉర్రూతలూగించిన ఒక గొప్ప కళాకారుడని, ఆయనను కోల్పోవడం కళారంగానికి, పేద ప్రజలకు తీవ్రలోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. గద్దర్ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఈ సమావేశంలో మామిడి దానవరప్రసాద్, పి.నాగేశ్వరరావు, ఎస్.గ్రీష్మ కుమార్, సీహెచ్ రమేష్, ఎస్.రామ్మోహన్, వి.శిరోమణి, టి.రాణి, వై.శ్రీను పాల్గొన్నారు.

12న మెడికల్ అధికారి పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు

జంగారెడ్డిగూడెం : స్థానిక మొగళ్లపు నరసయ్య మెమోరియల్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మెడికల్ అధికారి పోస్ట్ భర్తీకిగాను వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో ఏఆర్‌టీ సెంటర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఫుల్‌టైం అధికారిగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న, అర్హులైన అభ్యర్థులు ఈ నెల 12న ఏరియా ఆసుపత్రిలో ఉదయం 10.30కి నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి 62 ఏళ్ల వయసు లోపు ఉన్న వారు, హెచ్ఐవీ సెంటర్ లేదా ఇతర ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థికి నెలవారీ వేతనం రూ.72 వేలు ఉంటుందన్నారు.